క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: సత్యసాయి సేవా సంస్థల వారు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. పదో తరగతి విద్యార్థిని జి.గాయత్రి (ప్రథమ), తొమ్మిదో తరగతి విద్యార్థిని పెద్దిరెడ్డి వేదశ్రీ(ద్వితీయ), పదో తరగతి విద్యార్థిని కర్రా మహాలక్ష్మి (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారని హెచ్‌ఎం కె.ఘన సత్యనారాయణ తెలిపారు. డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో విజేతలను కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, ఎంఈవో ఎస్.దుర్గాదేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వానపల్లి ముక్కోటి రాంబాబు, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

21 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



కొలువులు సాధించిన కళాశాల విద్యార్థులు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇన్ఫోసిస్ కంపెనీ మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 21 మంది విద్యార్థులను ఎంపిక చేసి, ఉద్యోగ నియామక పత్రాలు అందజేసింది. ఉద్యోగాలకు ఎంపికైన ఒక్కో విద్యార్థికి వార్షిక వేతనం రూ.2.6 లక్షలని కళాశాల ప్రిన్సిపాల్ చింతల సుబ్బారెడ్డి తెలిపారు. బహుళజాతి కంపెనీలో ఉద్యోగాలను సాధించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ పి.చలపతిరావు, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి వారిని అభినందించారు.

మిల్క్ బాయిలర్ల సిబ్బందికి వేతనాలు పెంచాలి



ధర్నా చేస్తున్న మిల్క్ బాయిలర్ల సిబ్బంది

యానాం: తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాజీవ్‌గాంధీ అల్పాహార పథకంలో పని చేసే మిల్క్ బాయిలర్ల సిబ్బంది మంగళవారం స్థానిక ఆర్‌ఏఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు రూ.10 వేల నుంచి రూ.18 వేలకు వేతనాలు పెంచుతూ గతేడాది ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదన్నారు. వేతనాల పెంపు లేకపోయినప్పటికీ ఉదయం నుంచి సాయంత్రం వరకు తమకు సంబంధం లేని పనులను అప్పగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం తమ విధులను క్రమబద్ధీకరించాలని వారు కోరారు.

ఎస్ఎస్ఏ సిబ్బంది నిరసన



ముమ్మిడివరంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ముమ్మిడివరం: తమ డిమాండ్ల సాధన కోసం సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు మంగళవారం స్థానిక మండల విద్యా శాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, జీఓ నంబరు 2ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్‌కుమార్, నాగరత్నం, భువనేశ్వరి, వీర్రాజు, కేఎస్‌ఆర్ శ్రీనివాస్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ మృతికి పలువురి సంతాపం

తాళ్లరేవు: కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందడం బాధాకరమని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, వైస్ ఎంపీపీలు కొపనాతి లలిత, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, అంకాడి అంజిబాబు, కొపనాతి నాగరాజు, కొక్కిలిగడ్డ లోకేష్, మైదు హరిబాబు ఉన్నారు.

ఎండమాఊళ్లు

- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులపై నిర్లక్ష్యం
- పొదలు, చెట్లతో అడవిని తలపిస్తున్న వైనం
- గట్లు జారుతున్నా మరమ్మతుల ఊసెత్తని ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగం
- వేసవిలో తాగునీటికి గ్రామాల్లో గడ్డుకాలం



గుండెపూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చుట్టూ పెరిగిన వృక్షాలు



బలహీనపడి జారిపోతున్న గట్టు



ఇటీవల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ, ఇతర అధికారులు

అల్లవరం: ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్న సంకల్పంతో రెండున్నర దశాబ్దాల క్రితం అమలాపురం నియోజకవర్గంలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ రక్షిత తాగునీటి పథకం నేడు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. 1998–99లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంపీ కేఎస్‌ఆర్ మూర్తి ముందుచూపుతో శివారు ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర నిధులు వెచ్చించి గ్రామీణ రక్షిత తాగునీటి పథకాన్ని(ఆర్‌డబ్ల్యూఎస్) శివారు ప్రాంతాలకు పరిచయం చేశారు. దీంతో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అమలాపురం మండలంలో పేరూరు, ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి, అల్లవరం మండలంలో గుండెపూడి ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. గ్రామీణ రక్షిత తాగునీటి పథకం ద్వారా వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల గట్లు ప్రస్తుతం బలహీనపడి అధ్వానంగా మారాయి. గట్లపై భారీ వృక్షాలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. చెరువు గట్టుపై కాలు మోపే పరిస్థితి లేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీరు లీకేజీ కాకుండా ఏర్పాటుచేసిన సిమ్మెంట్ బల్లలు చెరువులోకి జారిపడుతున్నాయి.

మరీ అధ్వానం

గుండెపూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మరీ అధ్వానంగా ఉంది. గట్లు బలహీనంగా ఉండడంతో రెండు సార్లు గట్లు తెగిపడి, ప్రజల అవసరాలకు కోసం నిల్వ చేసిన నీరు వ్యర్థమైంది. ఈ ఘటన జరిగి ఆరేళ్లు కావస్తున్నా నేటికీ పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమయ్యారు. అప్పటి నుంచి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదు. అప్పటి నుంచి వేసవిలో నీటి ఎద్దడి తప్పడం లేదు. పేరూరు, చల్లపల్లిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిస్థితి ఇలాగే ఉంది. అప్పట్లో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఓహెచ్‌ఆర్ ట్యాంకుల పిల్లర్లకు పగుళ్లు ఏర్పడినా, మరమ్మతులకు నోచుకోవడం లేదు. పైపు లైన్ల వ్యవస్థ మరీ అస్తవ్యస్తంగా మారింది.

ఉన్నతాధికార్ల పరిశీలన

వారం రోజుల క్రితం జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి బోడసకుర్రు, గుండెపూడి ప్రాజెక్టులు పరిశీలించారు. బోడసకుర్రు ప్రాజెక్టుకు మోటారు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు రూ.6 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గట్లు బలహీనపడి, చెట్లు పెరిగిపోయి అధ్వానంగా ఉన్న గుండెపూడి ప్రాజెక్టుకు కనీసం ఒక్క రుపాయి కుడా కేటాయించకపోవడం గమనార్హం. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ తరుణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు అవసరమైన మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు నిధులు కేటాయించి, పనులు పూర్తి చేయకపోతే వేసవిలో గడ్డు పరిస్థితి ఎదురవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గట్లను పటిష్టపర్చాలి



గుండెపూడి ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మండలంలో పది గ్రామాల ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రజలకు అందిస్తున్న తాగునీటిలో శుద్ధత కొరవడింది. వేసవిలో నీటిని నిల్వ చేయడానికి త్వవిన చెరువుపై నిర్వహణ లోపించింది. చెరువు గట్టుపై భారీ వృక్షాలు పెరిగి గట్లు బలహీనపడ్డాయి. ఈ ప్రాజెక్టు నిర్మించి పాతికేళ్లు కావడంతో గట్లు బలహీనపడి చెరువులోకి జారుతున్నాయి. ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలంటే గుండెపూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గట్లు పటిష్టపర్చి, పునర్నిర్మించాలి. ఆ దిశగా ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

– జిత్తుక సత్యనారాయణ, బీఎస్పీ నాయకుడు, డి.రావులపాలెం

ప్రతిపాదనలు చేశాం



గుండెపూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గట్లను పటిష్టపర్చి, చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణం అవసరమని ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుతం ఉన్న శ్యాండ్ ఫిల్టర్ స్థానంలో రాపిడ్ శ్యాండ్ ఫిల్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

– స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, అల్లవరం

బాధిత కుటుంబాలకు పొన్నాడ పరామర్శ



గోవలంకలో బాధితుడిని పరామర్శిస్తున్న పొన్నాడ

తాళ్లరేవు: మండలంలోని పలు బాధిత కుటుంబాలను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. గోవలంక పంచాయతీలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న కో–ఆప్టెడ్ ఎంపీటీసీ సభ్యుడు కూరాటి శ్రీకృష్ణను ఇంటి వద్ద, అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆర్‌ఎంపీ వైద్యుడు కూరాటి నరసింహమూర్తిని పొన్నాడ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన మోర్త రాజేష్, మాతృవియోగంతో బాధపడుతున్న మోర్త నాగేశ్వరరావు కుటుంబాలను పొన్నాడ పరామర్శించారు. వీరికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్‌సాగర్, పెయ్యల కొండబాబు, మోకా మధుబాబు, దొరబాబు తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్: ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ వారు మంగళవారం స్థానిక గడియారం స్తంభం సెంటరులో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అమలాపురంలో తమ సంస్థ తరపున మూడు చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ తెలిపారు. ఆర్థికసాయం అందించిన దాత స్థానిక క్యాపిటల్ ఆర్థో హాస్పటల్ ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ ఎన్.విజయకుమార్ తొలి చలివేంద్రాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్లు గండి హారిక, పడాల శ్రీదేవి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల మార్జిన్లలో చెత్త లేకుండా చర్యలు

కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారాలను రోడ్లకు ఇరువైపులా మార్జిన్లలో వేయకుండా, చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి ప్రాసెసింగ్ చేయాలని, రెండు వారాల లోపు రోడ్లపై ఎక్కడ చెత్త కనపడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఈవోఆర్డీలను ఆదేశించారు మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని డీపీఓ, డీఎల్‌పీఓలు, ఈవోఆర్డీలతో సమావేశం నిర్వహించి, పారిశుధ్య వ్యవస్థ నిర్వహణ తీరుతెన్నులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడడంలో చెత్తాచెదారాల నిర్వహణే కీలక భూమిక పోషిస్తుందన్నారు. గ్రామాల్లో రోడ్ల మార్జిన్లలో చెత్త వేయకుండా ఉండేందుకు రెండు వారాలు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. గడువు అనంతరం రోడ్ల పక్క మార్జిన్లు ఎటువంటి చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రంగా కనిపించాలని ఆదేశించారు. రోడ్ల మార్జిన్లలో చెత్తాచెదారాలు వేయకుండా ఈఓఆర్డీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా అవగాహనను పెంపొందించాలన్నారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్వచ్ఛ భారత్ మిషన్, పన్నుల రూపేణా వచ్చే ఆదాయాల నుంచి పారిశుధ్యానికి వెచ్చించాలని సూచించారు. రోడ్డు మార్జిన్లు, పంట కాలువలు, డ్రైనేజీల గట్లపై చెత్తాచెదారాలకు నిప్పు అంటించి కాల్చరాదని స్పష్టం చేశారు. కేంద్రాల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తానని వెల్లడించారు. డీపీఓ శాంత లక్ష్మి, ఎల్‌పీవో రాంబాబు, ఈఓఆర్డీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై జ్వాలాసాగర్

ముమ్మిడివరం: మహిళలకు కల్పించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సై డి.జ్వాలాసాగర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా స్థానిక యాపిల్ స్కూల్‌లో విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. దిశా యాక్టు, మహిళలకు వచ్చే బెదిరింపు కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోలకు న్యాయం చేయాలి



సమావేశానికి హాజరైన వీఆర్వోలు

అమలాపురం రూరల్: ప్రభుత్వం క్రొత్తగా తీసుకువస్తున్న క్లస్టర్ వ్యవస్థలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్వోలకు హేతుబద్ధీకరణ వల్ల గ్రేడ్–1 వీఆర్వోలకు న్యాయం జరిగేలా రాష్ట్ర సంఘం కృషి చేయాలని అమలాపురం మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశం కోరింది. సంఘం మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్ అధ్యక్షతన మంగళవారం ఈ సమావేశం జరిగింది. ఇతర శాఖల సర్వేలు, పని ఒత్తిడిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అర్హులైన వీఆర్వోలకు రెవెన్యూ శాఖలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలి కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, ఏవీఎస్ రాజేష్, మాచిరాజు వాసు, శ్రీధర్, జయరాజు, సత్యవతి, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, పల్లి రాంబాబు, వీరబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.


తాగునీటి ఎద్దడిపై ఆర్‌ఏఓకు వినతి



ఆర్‌ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సావిత్రీనగర్ గ్రామస్తులు

యానాం: తీరప్రాంత గ్రామమైన సావిత్రీనగర్‌లో తాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సావిత్రీనగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొంతకాలంగా తాగునీటి సరఫరా తక్కువగా జరుగుతుందని, ఈ సమస్యను అనేక సార్లు అధికారులకు విన్నవించామన్నారు. రెండేళ్ల క్రితం కొత్త పైపులైన్ వేసి కొన్ని వీధులకు కనెక్షన్లు ఇవ్వడం వల్ల, మిగిలిన మూడు వీధులకు తాగునీటి ఎద్దడి తలెత్తుతుందని చెప్పారు. ఈ వేసవిలో సమస్య రాకుండా చూడాలని వారు కోరారు. అనంతరం పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు తదితరులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కాలాడి శ్రీనివాసరావు, పాలెపు వీరబాబు, అరదాడి హరినారాయణ, పాలెపు సత్యనారాయణ, తాతాజీ, బాబీ పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఉద్యోగుల ధర్నా



గ్యారేజ్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

అమలాపురం రూరల్: అమలాపురం డిపోకు చెందిన డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో గ్యారేజ్ వద్ద ఉద్యోగులు, కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణపతి మాట్లాడుతూ, డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలు, నిరాహార దీక్షలు చేసినా అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. డిపోలోని అన్ని యూనియన్లను కలుపుకొని పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1/2019 సర్క్యులర్ కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షలు పదో రోజూ కొనసాగాయి. సంఘ డిపో అధ్యక్షుడు హౌలియా, కార్యదర్శి పి.మణిరాజు, కె.రవికుమార్, పి.రాంబాబు, ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి గణపతి, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ డిపో ఉప కార్యదర్శి చింతా రంగప్రసాద్, ఆర్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వమిది



సమావేశంలో మాట్లాడుతున్న లోక్

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వంలో రైతులకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఇది ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వమని భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యదర్శి డీబీ లోక్ విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉప్పలగుప్తంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీర ప్రాంతాల్లో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు కరవైందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు ముందుందు తీవ్ర రోగాలను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వరిసాగు చేస్తున్న రైతులు సాగునీరు సక్రమంగా అందక చేలు ఎండిపోవడంతో, ఇంజిన్లతో నీరు పెట్టుకుంటూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఆయా విషయాలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా, వారు పట్టించుకోకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. రైతులను, ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం తక్షణమే స్పందించి, శివారు ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయకపోతే, ప్రజా, రైతు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పెయ్యిల పరశురాముడు, కొంకి వెంకటబాబ్జీ, దోనిపాటి ఆంజనేయులు, పండు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

12న అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు అరుణాచల గిరి ప్రదక్షిణ, తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనాల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. యాత్రలో కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం పుణ్యక్షేత్రం చేరుకుని, పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణ చేసుకుని, తిరుగు ప్రయాణంలో కంచి, తిరుపతి సర్వదర్శనం చేసుకొని అమలాపురం చేరుకుంటారని తెలిపారు. భోజనం, అల్పాహారంతో కలిపి టికెట్ ధర రూ.5,200గా నిర్ణయించారు. ఆసక్తి గల ప్రయాణికులు టికెట్ కోసం సెల్ నంబర్లు 70138 68687,73829 09620, 99592 25550, 99592 25576లో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంబడిలో మాట్లాడుతున్న డాక్టర్ సీతారామశర్మ

యానాం: దాళ్వా వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీతారామశర్మ అన్నారు. మంగళవారం యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ పథకంలో భాగంగా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జె.శివసుబ్రమణియన్ సూచనల మేరకు దరియాలతిప్ప గ్రామంలో రెండో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరిసాగులో చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం, దాళ్వా రకాల సాగు తదితర వాటిపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చిక్కాల జోగిరాజు, ఏఏఓ కూనంరెడ్డి సుబ్బారావు, ఆత్మ బీటీఎం రూప, ఏటీఎం చినబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



పాడి పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

అల్లవరం: గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైన అంటువ్యాధి అని, ఒకదాని నుంచి మరో పశువుకు గాలి ద్వారా వ్యాపిస్తుందని పశు సంవర్థక శాఖ అమలాపురం ఏడీ విజయారెడ్డి అన్నారు. వ్యాధి సోకిన పశువులకు నోటిలో, కాలు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, తీవ్ర జ్వరం వచ్చి, ఆహారం తీసుకోవడం మానేస్తాయన్నారు. జాతీయ సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోడసకుర్రు గ్రామంలో వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి గాలికుంటు వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 8,500 పశువులకు ఉచితంగా టీకాలు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూర్ణిమ, నాగలక్ష్మి, పశు వైద్య సహాయకులు వెంకటేశ్వరరావు, శివ, అశోక్, పాడి రైతులు పాల్గొన్నారు.

హైవే బెర్మ్‌లను తవ్వేస్తున్నారు



హైవేలో బెర్మ్‌లను తవ్వడంతో ఏర్పడిన గోతులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం కామనగరువు పసిడి చెరువు ప్రాంతంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద హైవే రోడ్డుకు వేసిన పెద్ద బెర్మ్‌లను రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వేస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని వేసిన మట్టిని తొలగించడం వల్ల వంతెన సైతం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని తవ్విన ప్రాంతాన్ని ఎన్‌హెచ్ అధికారులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినులు ధైర్యంగా ముందడుగు వేయాలి

అమలాపురం రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థినులు ధైర్యంగా ముందడుగు వేసి, తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రూరల్ మండలం వన్నెచింతలపూడి హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ఎన్నో చట్టాలు తీసుకువచ్చిందని, ఏదైనా అపాయం సంభవించినప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఈ చట్టాలు దోహదపడతాయన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నాగసత్యనారాయణ, పీఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.